సర్కారు స్థలం స్వాహా

- కుత్బుల్లాపూర్ మండల పరిధిలో ఆగని భూకబ్జాలు..
- చింతల్ భగత్‌సింగ్ నగర్‌లో ధోభీఘాట్ స్థలం స్వాహా..

ధోభీఘాట్ స్థలంలో వెలిసిన నిర్మాణాలు

దుండిగల్, డిసెంబర్ 12: కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణలేకుండా పోతుంది. సర్వేనంబర్ 155, చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లోని మొగుళ్లచెరువులో 29ఎకరాల10గుంటల ప్రభుత్వభూమి ఉండగా అందులో 24ఎకరాల10గుంటల స్థలంలో భగత్‌సింగ్‌నగర్ ఏర్పాటైంది. మిగిలిన 2ఎకరాల39 గుంటలను స్థానిక రజకులు గాంధీ వాషర్స్‌మెన్ కో-ఆపరేటివ్ సొసైటీ ధోభీఘాట్‌కు కేటాయించారు. అప్పట్లో 72 మంది రజకులు అసోసియేషన్‌లో ఉండగా తర్వాత మరో 12మంది చేశారు. అయితే అసోసియేషన్‌కు చెందిన మొత్తం 84మంది ధోభీఘాట్‌కు కేటాయించిన స్థలంలో ఇండ్లను నిర్మించుకున్నారు. మిగిలిన 29గుంటల స్థలంచుట్టూ ప్రహరీ నిర్మించారు. ఖాళీగా ఉన్న సదరు స్థలంపై కొందరు అధికార పార్టీ నేతల కన్నుపడింది. అసోసియేషన్ ప్రతినిధులను తమదారిలోకి తెచ్చుకున్న నేతలు సదరు భూమిని 29వరకు ప్లాట్లుగా మలిచిన నేతలు, అసోసియేషన్ ప్రతినిధులను కలుపుకొని తలాకొన్ని పంచుకున్నారు. ఇందులో స్థానికంగా పెద్దమనుషులగా చెలామణి అయ్యే కొందరు నాయకులతో పాటు అధికార పార్టీకి చెందిన నేతలు ఉన్నట్లు తెలుస్తుంది. ఇందుకు అధికార యంత్రాంగం నుంచి సంపూర్ణ సహకారం అందుతుండటంతో పక్షం రోజుల్లోనే సదరు భూముల్లో నిర్మాణాలు వెలిశాయి. ఇక్కడ పట్టపగలే, బాహాటంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం పట్ల అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇక్కడ గజం ధర సుమారు70వేలు పలుకుతుండటంతో ఇంకేముంది ఎవరికి వారుగా అందినకాడికి దండుకుంటున్నట్లు సమాచారం. పైగా సదరు ప్రభుత్వ భూమి సర్వేనంబర్‌ను మార్చిన అక్రమార్కులు పనిలోపనిగా గదులు నిర్మిస్తున్నట్లు తెలుస్తుంది.

సర్వే రిపోర్ట్ ఆధారంగాచర్యలు

చింతల్ భగత్‌సింగ్‌నగర్‌లోని ధోభీఘాట్ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నట్లు మాకు సమాచారం వచ్చింది. మా సిబ్బంది అక్కడకు వెళ్లి నిర్మాణాలను నిలిపివేసే ప్రయత్నం చేశారు. అక్కడ నిర్మాణాలు జరుగుతున్న భూమి ప్రభుత్వ భూమిలోకి రాదని నిర్మాణదారులు పేర్కొనడంతో.. మొత్తం భూమిని సర్వేచేయాలని నిర్ణయించాం. అప్పటి వరకు నిర్మాణాలు చేపట్టవద్దని సూచించాం. సర్వే నివేదిక తర్వాత చర్యలు తీసుకుంటాం.

– తాసీల్దార్ రెహమాన్

బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశమై సమస్యలు తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

దుండిగల్, డిసెంబర్ 12: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తెలిపారు. గురువారం ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ సంక్షేమసంఘాల సభ్యులు, బీఆర్ఎస్ కార్యకర్తలు గురువారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి.. పలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాలు అందజేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి మహా పడిపూజ

ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ ఆటో స్టాండ్ 40 ఫీట్ రోడ్డులో వెంకటరమణ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడి పూజ గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణేశ్ సహా అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 12

పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, డిసెంబర్ 12: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని కాలనీల్లో పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించకుండా ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రపర్చేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ విభాగం అధికారులను కార్పొరేటర్ సబీహాబేగం ఆదేశించారు. పలు కాలనీల్లో నెలకొన్న పారిశుధ్య సమస్యలపై గురువారం స్థానిక వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ శానిటేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో స్వచ్ఛ ఆటోలు ప్రతి ఇంటి వెళ్లి చెత్తను సేకరించేలా ఎస్ఎఫ్ఏలు, ఏఎస్ఆర్ చర్యలు తీసుకోవాలని సూచించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తకుప్పలను ఎప్పటిప్పుడు సిబ్బంది తొలగించేలా నిత్యం పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఆర్‌పీ సురేశ్, ఎస్ఎఫ్ఏ అరుణ్, నరసింహ, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యతను పాటించాలి

శ్రీహరినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శిలిషాబాబురావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 12: రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని కార్పొరేటర్ శిరీషాబాబురావు అన్నారు. గురువారం బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని శ్రీహరినగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలు, బస్తీల్లో దెబ్బతిన్న రోడ్లను బాగుచేయడం జరుగుతుందన్నారు. రోడ్డు పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జయరాజ్, భాస్కర్‌రావు, సుశీల్, శారద తదితరులు ఉన్నారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

శేరిలింగంపల్లి, డిసెంబర్ 12: ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి తెలిపారు. గురువారం నానక్‌రాంగూడలో రూ.59లక్షలు, నేతాజీనగర్‌లో రూ.30లక్షల వ్యయంతో చేపడుతున్న నిర్మాణ పనులను జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మౌలిక వసతుల కల్పనలో ఆదర్శవంతంగా గచ్చిబౌలి డివిజన్‌ను తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. స్థానిక నాయకులు శివసింగ్, కైలాష్‌సింగ్, ప్రకాశ్‌సింగ్, శ్రీకాంత్‌రెడ్డి, లోకేందర్ రెడ్డి, సుమన్, విశాల్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

నానక్‌రాంగూడలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి

రాష్ట్ర స్థాయి చట్టాలు 80 శాతం శిక్షలు కార్మిక చట్టాలే..

రౌండ్ టేబుల్ సమావేశంలో హాజరైన పలువురు ప్రతినిధులతో కలిసి పాల్గొన్న టీమ్‌లీజ్ రెగ్‌టెక్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్

మాదాపూర్, డిసెంబర్ 12: సంక్లిష్టమైన వ్యవస్థను సరళీకరించడం, సంస్థల్లో కంప్లీయన్స్ ఆధారిత సంస్కృతిని సృష్టించడం, సంకేతిక నవీకరణను ప్రోత్సహించడం వంటి చర్యలు దేశంలో సమర్థవంతమైన రెగ్యులేటరీ వ్యవస్థను నిర్మించడంలో ముఖ్యమైన దశలుగా గుర్తించబడినట్లు టీమ్‌లీజ్ రెగ్‌టెక్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ అన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో టీమ్‌లీజ్ రెగ్‌టెక్ కంప్లైయన్స్ 3.0 బియాండ్ యాక్సిడెంటల్ కంప్లియన్స్‌పై రౌండ్ టేబుల్ కాన్ఫిరెన్స్ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లీమ్‌లీజ్ రెగ్‌టెక్ సీఈఓ, సహ వ్యవస్థాపకుడు రిషి అగర్వాల్ విచ్చేసి మాట్లాడారు. రెగ్యులేటరీ వ్యవస్థ యొక్క సంక్లిష్టత, మార్పులతో కూడిన కంప్లియన్స్ వాతావరణం, అధిక మాన్యువల్ ప్రక్రియలు, రెగ్యులేటరీ పరిశీలన పెరగడం వంటి ముఖ్యమైన సవాళ్లపై చర్చించారు. భారతదేశంలో రెగ్యులేటరీ యూనివర్స్ 1536 చట్టాలతో కూడి ఉన్నట్లు తెలిపారు. 69233 కంప్లియన్స్, 6613 ఫైలింగ్స్‌కు దారితీస్తున్నట్లు చెప్పారు. ఈ చట్టాల్లో 55 శాతం పైగా జైలు శిక్షలు, ప్రతి 5 కంప్లియన్స్‌లో 2 నేరపూరితమైన అలంకరణలను సూచిస్తాయని, 5 లో 3 సంవత్సరానికి పైగా జైలు శిక్ష పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి చట్టాలు 80 శాతం శిక్షలు కారణమవుతాయని, ఇందులో ముఖ్యమైన కార్మిక చట్టాల నుంచి వస్తుందని తెలిపారు. ఇవి 68 శాతం శిక్షలను కలిగి ఉంటాయి. చట్టాలను సులభతరం చేయడానికి నియంత్రణ సంస్థలు ఆధిక్యత తీసుకొని నియమాలను సరళీకరించి పునరావృత్తాలను తగ్గించి డిజిటలైజేషన్‌ను ప్రోత్సహించాలని పేర్కొనబడినట్లు తెలిపారు. చర్చదారుల ప్రకారం.. ముఖ్యమైన కార్యాచరణ అంశాలలో డిజిటల్ టూల్స్, వ్యవస్థలను ఉపయోగించి కంప్లైయన్స్ ట్రాకింగ్‌ను సరళీకరించడం, పేపర్ లెస్ డాక్యుమెంట్‌లను నిర్వహించడం, పారదర్శకతను పెంచడం, సాంఘిక నేరపూరితమైన నియమాలను తగ్గించడం ద్వారా దృష్టి సారించడమే మూడు పదార్థాలు, ప్రేమ్ వర్క్ అయిన సరళీకరణ డిజిటైజేషన్, డీక్రిమినలైజేషన్ ద్వారా ముడిపడి ఉండే నియమాలను సరనళీకరించడం గురించి చర్చించడం జరిగింది. ఒక సంస్థ యొక్క విలువలు, దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా వ్యూహాత్మకమైన ఎంపికలు ఈ రౌండ్ టేబుల్‌లో చర్చించారు.

ఎంఎంఎస్ పరీక్షా తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్) కోర్సు పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంఎస్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవచ్చని సూచించారు.

యూజీసీ నెట్ పేపర్ -1 పరీక్షకు ఉచిత శిక్షణ

మాట్లాడుతున్న ప్రొఫెసర్ సీవీ రంజని

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ హ్యూమన్ క్యాపిటల్ డెవలప్‌మెంట్ సెంటర్ (హెచ్‌సీడీసీ) ఆధ్వర్యంలో యూజీసీ నెట్ పేపర్- 1 పరీక్షకు ఉచిత శిక్షణా కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సీఎఫ్ఆర్‌డీ భవనంలోని ఈ క్లాస్‌రూంలో నిర్వహించిన శిక్షణ ప్రారంభోత్సవంలో హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సీవీ రంజని, కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్‌రెడ్డి, ఓయూ సివిల్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ కొండా నాగేశ్వర్ రావు మాట్లాడుతూ .. నెట్ పరీక్షకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఈ శిక్షణ ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. విద్యార్థుల విద్యాప్రమాణాలను మెరుగుపరచడం తోపాటు వారి లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. శిక్షణకు విద్యార్థులు అధిక సంఖ్య లో హాజరయ్యారు.

వైద్యులతో చిన్నారి అక్షర, కుటుంబ సభ్యులు

3 నెలలు కోమాలో.. కోలుకున్న చిన్నారి

12 ఏండ్ల చిన్నారికి విజయవంతంగా క్లిష్టమైన శస్త్రచికిత్స

కొండాపూర్, డిసెంబర్ 12: మెదడులో ఏర్పడిన అత్యంత క్లిష్టమైన ట్యూమర్ (మెడులోబ్లాస్టోమా)ను హైటెక్‌సిటీ మెడికవర్ దవాఖాన వైద్యులు విజయవంతంగా తొలగించి.. 12 ఏండ్ల అక్షర ప్రాణాలు కాపాడారు. చికిత్సకు సంబంధించిన పూర్తి వివరాలను గురువారం దవాఖానలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి వెల్లడించారు. అక్షర తరగతి గదిలో తరచుగా నిద్రపోవడం గుర్తించిన ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు తెలియజేశారు. చిన్నారి వైద్యులకు చూపించగా ఆమె చిన్న మెదడు భాగంలో మెడులోబ్లాస్టోమా అను ట్యూమర్‌ను గుర్తించారు. కాగా ట్యూమర్ తొలగింపు అత్యంత క్లిష్టమైనదని, శస్త్ర చికిత్స సమయంలో పక్షవాతం లేదా ప్రాణాపాయం వంటి సమస్యలున్నప్పటికీ మెడికవర్ వైద్య బృందం విజయవంతంగా శస్త్రచికిత్స చేసి ట్యూమర్‌ను తొలగించారు. చికిత్స అనంతరం అక్షర హైడ్రోసెఫలస్ అనే సమస్యకు గురవడంతో వెంట్రికులోపెరిటోనియల్ (వీపీ) షంట్ సర్జరీని చేశారు. సర్జరీ అనంతరం అక్షర కోమాలోకి వెళ్లింది. మూడు నెలలుగా కోమాలో ఉన్న అక్షరకు మెరుగైన చికిత్స అందిస్తుండటంతో అకస్మాత్తుగా మేల్కొని తన తండ్రితో మాట్లాడింది. అనంతరం అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించగా, అక్షర పూర్తిగా కోలుకున్నట్లు, ట్యూమర్ సైతం పూర్తిగా తొలగిపోయినట్లు నిర్ధారించినట్లు వైద్యులు తెలిపారు.

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కలిసిన ప్రజలు

దుండిగల్, డిసెంబర్ 12: బీఆర్ఎస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, సంక్షేమసంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలి

అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి చలో హైదరాబాద్ కార్యక్రమానికి బయలుదేరుతున్న సీఐటీయూ జిల్లా నాయకులు ఐలాపురం రాజశేఖర్

బాలానగర్, డిసెంబర్ 12: బాలానగర్, కూకట్‌పల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఐలాపురం రాజశేఖర్ అన్నారు. గురువారం బాలానగర్, కూకట్‌పల్లి మండలాల అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్లు, యూనియన్ నాయకురాలు వసంత, లక్ష్మితో కలిసి చలో హైదరాబాద్ (ఇందిరాపార్క్) ధర్నాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. టీచర్లకు 18వేలు, హెల్పర్లకు 12 వేలు, వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లపై అధికారుల ఒత్తిడి పెరుగుతున్న కారణంగా కొంతమంది అనారోగ్యాలకు గురవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సారిక, శ్వేత, రజిత, హేమ, రమ, ఉమ, సంగీత, శశికళ, శారధ, పద్మ, షాలిని, కృప, రాణి, రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

పీడిత వర్గాల కోసం పోరాడిన నేతలకు నివాళులు



ఎంసీపీఐయూ హైదరాబాద్ గ్రేటర్ కమిటీ ఆధ్వర్యంలో కమ్యూనిస్టు అమరవీరులు సోమరాజన్న, గోనె చేరాలు వర్ధంతి కార్యక్రమాన్ని మియాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ గ్రేటర్ కార్యదర్శి మైదం శెట్టి రమేశ్, తాండ్ర కళావతి వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ.. దోపిడీ దారులకు వ్యతిరేకంగా పీడిత వర్గాలకు అండగా రాజీలేని పోరాటం చేశారన్నారు. వారి జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తుడుం అనీల్‌కుమార్, దశరథ్, భాగ్యమ్మ, రాణి, పుష్పలత, స్థానిక నేతలు పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 12

ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ ముందు అయ్యప్పస్వాముల నిరసన

కొంపల్లి ఢిల్లీ వరల్డ్ స్కూల్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న అయ్యప్పస్వాములు

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12: కొంపల్లిలోని ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్లో అయ్యప్పమాలను ధరించిన ఓ విద్యార్థికి అవమానం జరిగిందంటూ గురువారం అయ్యప్పస్వాములు, బీజేపీ, ఏబీవీపీ ఆధ్వర్యంలో స్కూల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. అయ్యప్ప మాల ధరించి స్కూల్‌కు రావద్దని స్కూల్ యాజమాన్యం ఓ విద్యార్థి తండ్రిని వేధించడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దీంతో అయ్యప్పస్వాములు, బీజేపీ, ఏబీవీపీ నాయకులు నిరసన వ్యక్తం చేయగా స్కూల్ యాజమాన్యం దిగి వచ్చింది. ఎట్టకేలకు మాలను ధరించినా అభ్యంతరం లేదని, బాధిత విద్యార్థి తండ్రికి క్షమాపన చెప్పడంతో గొడవ సద్దుమనిగింది. ఈ నిరసనలో బీజేపీ నేతలు పి.శివాజీరాజ్, రాజిరెడ్డి, భరత్‌సింహారెడ్డితో పాటు ఏబీవీపీ నాయకులు, అయ్యప్పస్వాములు పాల్గొన్నారు. కాగా స్కూల్ వద్ద ఎలాంటి ఘర్షణ వాతావరణం చోటు చేసుకోకుండా సీఐ విజయ్‌వర్ధన్ నేతృత్వంలో తగు బందోబస్తు చర్యలు తీసుకున్నారు.

ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12: ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రా థోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం. కుమార్ ని యామక పత్రం అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ఆయన ఇంతకుముందు పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సేవలందించారు. ఆయన గతంలో ఓయూ ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఐయూటీ సెక్రెటరీ, నిజాం కళాశాల ప్రిన్సిపాల్, తదితర బాధ్యతలు నిర్వర్తించారు. ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా)లో క్రియాశీలకంగా పనిచేయడంతోపాటు కార్యవర్గంలో వివిధ పదవులకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు, విద్యార్థి నాయకులు అభినందించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండాపూర్, డిసెంబర్ 12: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగండ్ల ఫ్లైఓవర్ కింద 65 -70 సంవత్సరాల వయస్సున్న వృద్ధుడు చలనం లేకుండా ఉన్నాడన్న సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించుకుని అంబులెన్స్‌లో పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. కాగా వృద్ధుడు కొద్ది రోజులుగా చుట్టు పక్కల పరిసరాల్లో భిక్షాటన చేస్తూ, ఫ్లైఓవర్ కింద ఉంటున్నట్లు సమాచారం. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మడ్గులపల్లి మండలంలోని బీమన్‌పల్లి గ్రామానికి చెందిన కొండేటి సైదులు(40) సలోమి దంపతులు బతుకుదెరువు కోసం మైసమ్మగూడలోని మల్లారెడ్డి క్యాంపస్ బాయ్స్ హాస్టల్‌లో క్లీనింగ్ పనులు చేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. కాగా కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పులు అధికం కావడంతో భార్యభర్తల మధ్య నిత్యం గొడవలు జరుగుతుండేవి. ఇదే క్రమంలో బుధవారం రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగడంతో భార్య సలోమి హాస్టల్ కింద ఉన్న హాల్‌లో నిద్రపోయింది. సైదులు ఒక్కడే తాము ఉంటున్న గదిలో గడియ పెట్టుకొని పడుకున్నాడు. గురువారం ఉదయం సలోమి తన గదికి వెళ్లి తలుపులు తీయమని ఎంత పిలిచినా స్పందన లేకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించాడు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించిన అనంతరం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ఆక్రమణల కూల్చివేత

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 10వవార్డు సింహా లేఅవుట్‌లో రోడ్డును ఆక్రమించి ఓ వ్యక్తి గత కొన్నెండ్లుగా షెడ్డు, ఇతర నిర్మాణాలను చేపట్టారు. దీంతో కాంగ్రేస్ పార్టీ కొంపల్లి అధ్యక్షులు బైరి ప్రశాంత్‌గౌడ్ ఈ విషయంపై కొంపల్లి మున్సిపాలిటీ కమిషనర్ శ్రీహరికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. దీంతో అధికారులు గురువారం రోడ్డును ఆక్రమించిన నిర్మాణాలను కూల్చివేయంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

నిరుపేద క్షత్రియుల సంక్షేమానికి కృషి

కుత్బుల్లాపూర్, డిసెంబర్ 12: నిరుపేద సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని క్షత్రియ కల్చరల్ అసోషియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఇందుకోసం హైదరాబాద్ కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అధ్యక్షుడిగా పొత్తూరి శివాజీరాజు, ప్రధానకార్యదర్శి దండు వరహాలరాజు, ఉపాధ్యక్షుడు భూపతిరాజు చిరంజీవి, కోశాధికారి సాగిరాజు భానుకుమార్, సంయుక్తకార్యదర్శి హరిగోపాల్‌రాజు, కార్యవర్గసభ్యులుగా సుధీర్, నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్.వర్మరుద్రరాజు గురువారం వారిని అభినందించారు. సేవా కార్యక్రమాలతో సంఘం సంక్షేమం ముందుకు సాగాలని సూచించారు.

25న మెగా జాబ్ మేళా

సిటీబ్యూరో, డిసెంబర్ 12(నమస్తే తెలంగాణ): మాదాపూర్‌లోని శ్రీవెంకటేశ్వర గ్రూప్ ఆఫ్ కాలేజెస్‌లో ఈనెల 25వ తేదీన నిరుద్యోగ బ్రాహ్మణ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించే దిశగా మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు హైర్ ద బెస్ట్ బ్రెయిన్స్ వ్యవస్థాపకులు ఆలూరి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో నిరుద్యోగులైన బ్రాహ్మణ యువతీయువకులు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 18005712511 టోల్‌ఫ్రీ నంబర్‌లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆలూరి కోరారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

బాలానగర్ సీఐ నర్సింహరాజు

బాలానగర్, డిసెంబర్ 12: మోగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకొని సమస్యలను పరిష్కరించుకోవాలని బాలానగర్ సీఐ నర్సింహరాజు పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14వ తేదీ వరకు జరిగే లోక్ అదాలత్‌తో పాల్గొని డ్రంక్ అండ్ డ్రైవ్, నంబర్‌ప్లేట్ లేకుండా నడిపించే వాహనాల కేసులు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపించిన కేసులు, మైనర్లు వాహనాలు నడిపించడం, రాంగ్ రూట్ డ్రైవింగ్ తదితర కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసు సంబంధిత కేసులతో పాటు పాత కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి పంపకాలు, భార్యభర్తల పంచాయతీలు, బ్యాంక్ రికవరీలు, చెక్ బౌన్స్ కేసులు, కొట్లాట కేసులు, రోడ్డు ప్రమాదాలు, పేకాట, ఎక్సైజ్ కేసులు, దొంగతనం తదితర కేసులను పరిష్కరించుకోవడానికి చక్కటి సులువైన మార్గం లోక్‌అదాలత్ అన్నారు. పంతాలకు పోకుండా రాజీ మార్గలను అవలంభించాలని సూచించారు. రాజీ మార్గం ద్వారానే మానసిక ప్రశాంతత లభిస్తుంద